తుదిదశకు బతుకమ్మ కుంట పనులు


కుంటను పరిశీలిస్తున్న అధికారులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో జరుగుతున్న బతుకమ్మ కుంట పనులు తుదిదశకు చేరుకున్నాయి. 3 నెలల క్రితం ప్రారంభమైన పనులు వచ్చే నెల 2వ తేదీన బతుకమ్మ పండుగ రోజు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. శనివారం డీఈ రూపాదేవితో పాటు ఏఈ తిరుపతి బతుకమ్మకుంట పనులను పరిశీలించారు. నియోజకవర్గంలో ఎక్కడ లేనటువంటి సదుపాయాలతో సుమారు రూ.20 లక్షలతో ఈ మోడ్రన్ బతుకమ్మ కుంట తయారవుతుందన్నారు. అలాగే బతుకమ్మ వేసేందుకు 0.75 లోతుతో పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ బతుకమ్మ ఆడడానికి వచ్చిన వారికి ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలతో పనులు జరుగుతున్నాయన్నారు.

వాటర్‌ప్లాంట్‌లో అవకతవకలంటూ ఫిర్యాదు

జీడిమెట్ల: ఎస్‌ఆర్ నాయక్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్‌ప్లాంట్‌లో అవకతవకలు జరుగుతున్నాయని కాలనీకి చెందిన పలువురు జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాలనీలో నడుస్తున్న వాటర్‌ప్లాంట్ లెక్కలు అడగగా ప్రెసిడెంట్ శ్రీనివాసరావు లెక్కలు ఇవ్వకుండా దౌర్జన్యానికి దిగుతున్నాడంటూ కాలనీకి చెందిన ఎ.అజయ్‌కుమార్, పి.వి.భాస్కర్‌రెడ్డి, సి.హెచ్ మహేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరావును వివరణ కోరగా వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన లెక్కలను ప్రతి జనరల్ బాడీ మీటింగ్‌లో చూపిస్తున్నానని చివరగా జరిగిన జనరల్ బాడీ ఆగస్టు 25 2024నాడు సైతం అన్ని లెక్కలను చూపించానని అన్నారు. కేవలం ఎన్నికల్లో ఓడిపోయామనే అక్కసుతో ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు.

మల్లారెడ్డి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

లక్ష్మీకాపూర్: సూరారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిలో శనివారం శస్త్ర చికిత్స నిర్వహించారు. కార్డియాక్ సర్జన్ల ప్రత్యేక బృందం 27 ఏళ్ల వయస్సు గల ఒక వ్యక్తికి ఆర్‌ఎస్‌ఓవీ వ్యాధికి సంక్లిష్టమైన హృదయ శస్త్ర చికిత్సను విజయ వంతంగా పూర్తి చేశారు. మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ నిపుణుడు డా.హరీష్ బాదామి మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఓవీ అనేది గుండె పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఈ కార్డియాక్ సర్జరీ మంచి పురోగతిని సాధించిందన్నారు. అధిక సంఖ్యలో పెరుగుతున్న హృద్రోగులకు ఈ విధానం మేలు చేస్తుందని ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన పెద్ద కోతలు కాకుండా, అతి తక్కువ ఇన్వాసివ్ టెక్నిక్‌లలో పక్కటెముకల మధ్య, ఛాతీ గోడలో చిన్నగా కోతతో సరిపోతుందన్నారు. శస్త్రచికిత్స ఫలితంతో రోగి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని తెలిపారు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న కాంగ్రెస్


మంజూరు పత్రాలను అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నిలబెట్టుకుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కు ఎల్పీజీ సిలిండర్ లబ్ధిదారులకు శనివారం బాచుపల్లిలోని చౌకధరల దుకాణంలో మంజూరు పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సీతారామ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శంకర్, అశోక్, యాదయ్య, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వ్యర్థాల తొలగింపు


విగ్రహాల వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలోని గణేష్ నిమజ్జనంలో భాగంగా చెరువులో వేసిన విగ్రహాల వ్యర్థాలను జీహెచ్‌ఎంసి సిబ్బంది తొలగిస్తున్నారు. ఇప్పటికే ఎనభై శాతం మేర విగ్రహాలను తొలగించగా మిగతా వాటిని తరలిస్తున్నారు. అనంతరం ఘాట్‌లోని నీరును తోడి శుభ్రం చేస్తున్నారు.

పాజిటివ్‌గా ఆలోచించాలి


సమావేశంలో పాల్గొన్న క్రైస్తవులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని హైందవ గౌరీక్ కన్వెన్షన్‌లో శనివారం యెహోవా సాక్షుల ప్రాదేశిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. పాజిటివ్‌గా ఆలోచించడం అలవర్చుకుంటే చెడు మార్గాల వైపు వెళ్లేందుకు ఆస్కారం ఉండదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఏసు కథ ఎపిసోడ్ వీడియో డ్రామా ఆకట్టుకుంది.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

నిజాంపేట్: కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. శనివారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం బాలపీరు మాట్లాడారు. ఈ నెల 19న తాను కేజీఆర్ కన్వెన్షన్ హాల్లో భోజనం చేస్తుండగా మోహన్ అనే వ్యక్తిని తాగడానికి నీళ్లు అడిగానని, అతను బాటిల్ అందిస్తుండగా దండు స్వామి, దశరథ్ అనే వ్యక్తులు కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తన కులాన్ని తక్కువ చేసి మాట్లాడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం

- టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వినోద్‌కుమార్, కురుమూర్తి


అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడితో నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు విడదీసి పాలన చేసిందని, ఇప్పటికీ కొన్ని కొత్త సంఘాలు పుట్టుకొచ్చి, ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టించే పనిచేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం నగర శివారులో ఏర్పాటు చేసిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇందులో నూతన జిల్లా కమిటీ ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టిందని, హెల్త్ కార్డుల విషయాన్ని తేల్చలేదన్నారు. పోడీలు లేవని విమర్శించారు. ఉద్యోగులకు గజం జాగా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మనం కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, ఉద్యోగుల ఐక్య కార్యాచరణతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. టీజీవో అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా జిల్లాలలో సమావేశాలు, ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ... అసోసియేషన్‌ను బలోపేతానికే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. 2023లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వివిధ శాఖల అధికారుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నారు. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, నూతన జిల్లా కమిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బి.వినోద్ కుమార్, కార్యదర్శిగా పశు సంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 మందితో అసోసియేషన్ నూతన కమిటీని సమావేశం ఎన్నుకుంది. ఇందులో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కె. వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా ఐ.విజయకుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా విష్ణు వర్ధన్ రావు (ఎఫ్‌ఆర్‌వో), ఎం.అర్చన, ఆర్‌ఎంవీ ఆనందరావు, ట్రెజరర్‌గా డి.కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.హెచ్.రమేష్, పబ్లిసిటీ సెక్రటరీగా డాక్టర్ ఇ.సత్యనారాయణ, ఆఫీసు సెక్రటరీగా ఎన్.సాయికృష్ణ, కల్చరల్ సెక్రటరీ గా బి.నాగమణి, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ శ్యామల, హెచ్.నాయుడు, డాక్టర్ ఎస్.స్వాతి, పి.డాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరించిన సొసైటీ సభ్యులు

రంగారెడ్డినగర్: చెన్నారెడ్డినగర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గాంధీనగర్, చెన్నారెడ్డినగర్, రంగారెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన 34 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా పుడమిరత్న అవార్డు గ్రహీత వాకిటి రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బోధనల ద్వారానే ప్రతి విద్యార్థి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుంటారని, తల్లిదండ్రులతో సమానమైన ఉపాధ్యాయులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములు, చెన్నారెడ్డినగర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు భాషయ్య, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు నాగేశ్వరి ,అనురాధ, అరుణ, ఉమ, మహిపాల్ రెడ్డి,కుమార్, సబిత, పార్వతీ, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ రాజ్యాంగం, సార్వభౌమాధికారం, ప్రతిష్టను భంగపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి ఆరోపించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ భారతదేశానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రతినిధి దాసి నాగరాజు ఆధ్వర్యంలో నిజాంపేట హనుమాన్ టెంపుల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీలో చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ..విదేశాల్లో దేశ ప్రతిష్టకు భంగం కలిగేలా మాట్లాడిన రాహుల్ గాంధీ భారతదేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే రాబోవు కాలంలో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలాంటి వాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతియాదవ్, ప్రసాద్ రాజు, సుమన్ రావు, శిల్పారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, కౌశిక్, అంజి, కొంకిరాము, గంగాధర్ పాల్గొన్నారు

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని బీజేపీ నాయకుడు నటరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్ బాపునగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా నటరాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో దూసుకువెళ్లాలంటే అది బీజేపీ తోనే సాధ్యమని, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో నేడు దేశం మూడో ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర రావు, శ్రీధర్‌వర్మ, రవియాదవ్, శ్రీధర్, అలివేలు, సుజాత, లావణ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల మార్పు

రంగారెడ్డినగర్: వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాల మార్పులకు విద్యుత్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న మూడు హెచ్‌టీ స్తంభాలను మార్చారు. కాలనీ అధ్యక్షుడు శంకరయ్య రాకపోకలకు ఆటకంగా మారిన స్తంభాల విషయమై సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన వారు క్రేన్‌ల సహాయంతో స్తంభాలను పక్కకు మార్చారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం


మందులు అందజేస్తున్న వైద్యులు

రంగారెడ్డినగర్: మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన శిబిరంలో 200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, నాయకులు మేకల ఎల్లయ్య, రాములు, డాక్టర్ అనన్య, సిబ్బంది ఓబుల్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు తిమ్మయ్య, శ్రీధర్, వెంకట సాయి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి


మొక్క నాటుతున్న కమిషనర్ సౌజన్య, కార్పొరేటర్ లక్ష్మీకుమారి

నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సౌజన్య అన్నారు. శనివారం ప్రగతి నగర్ ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవాలో హాజరైన కమిషనర్ స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకుమారితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ముందు రెండు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.

◆ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని సర్వే నెంబరు 334లోని ఖాళీ స్థలంలో ప్రజల ఉపయోగార్థం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ సౌజన్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మారుతిసాగర్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, మున్సిపల్ నిధులను కేటాయించి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య, సభ్యులు ఉన్నారు.

అధికారులు.. ఇదేం తీరు?


ప్రారంభానికి నోచుకోని క్యాష్ కౌంటర్

చింతల్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా తయారైంది కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ అధికారుల తీరు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం ఆవరణలో బిల్లులు చెల్లించేందుకు జలమండలి ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్ శిథిలావస్థకు చేరి వర్షం వచ్చిన సమయంలో నీరు క్యాష్ కౌంటర్‌లోకి చేరేది. అప్పటి జీఎం శ్రీధర్ రెడ్డి క్యాష్ కౌంటర్ పునర్నిర్మాణ పనులకు సంకల్పించి పనులు మొదలు పెట్టించారు. సుమారు రూ.1.80 లక్షలతో పనులు చేపట్టేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ కాస్త ఆలస్యం చేసినా పునర్నిర్మాణ పనులు పూర్తి చేసి రెండు నెలలు గడిచినా క్యాష్ కౌంటర్ అందుబాటులోకి రాలేదు. కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయ ఆవరణలో రెండు సబ్ డివిజన్‌లు, ఒక రెవెన్యూ డివిజన్ కార్యాలయాల కింద ఐదు సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క అధికారి కూడా క్యాష్ కౌంటర్ విషయమై పట్టించుకోకపోవడం వల్లే ప్రారంభానికి ఆలస్యం అవుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల్లో భాగంగా జీఎం, డీజీఎంలు మారిన క్యాష్ కౌంటర్ నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారిందంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి నిధులు విడుదల చేస్తే స్థానిక ఎమ్మెల్యే పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. గాజులరామారం డివిజన్ ఉషోదయకాలనీలో ధ్వంసమైన రోడ్డు పనులకు రూ.64 లక్షల నిధులు మంజూరైన నేపథ్యంలో శనివారం కాలనీ అసోసియేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి పైపులైన్ల ఏర్పాటు చేసే క్రమంలో రోడ్డు ధ్వంసమై స్థానికులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే సమస్యను పట్టించుకోలేదని, తాను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో కాలనీ ప్రధాన కార్యదర్శి సతీష్ బాబు, కాలనీవాసులు వెంకటరెడ్డి, టీవీశ్రీను, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, గురుప్రసాద్, రషీద్ బేగ్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. నేల చూపు!



శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. కెమెరాలను ప్రారంభించడంలో చూపుతున్న శ్రద్ధ వాటి నిర్వహణలో చూపడం లేదు. దీంతో పలు చోట్ల సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, మరికొన్ని చోట్ల నేల చూపులు చూస్తున్నాయి. చింతల్ గణేష్ నగర్ బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కిందకు జారిపోయిందని సంబంధిత అధికారులు వాటిని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. చింతల్

తెలుగు సాహిత్యాభివృద్ధికి 'సురవరం' కృషి


తెలుగు యూనివర్సిటీని సందర్శించిన బీజేపీ నాయకులు

నిజాంపేట్: తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డికి సముచిత గౌరవం లభించిందని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నాయకులు బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి తెలుగు కవితలు, రచనల ద్వారా తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని నింపిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలుగు యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

భోజనానికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

- వాహనం తగిలి వ్యక్తి మృతి

సుభాష్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని టాటా ఇంట్రా వాహనం తాకడంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ రూప్‌సింగ్ కొంపల్లిలోని డాబర్ ఇండియా లిమిటెడ్‌లో సరుకు అన్‌లోడ్ చేసేందుకు ఈ నెల 19న డ్రైవర్ లాలాసింగ్‌తో కలిసి లారీపై వచ్చాడు. ఈ నెల 20న మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన ఐషర్ బస్సు పక్కనే ఉన్న టాటా ఆటో ట్రాలీని ఢీకొట్టింది. దీంతో ట్రాలీ రోడ్డు పక్కన ఉన్న టాటా ఇంట్రా వాహనాన్ని తాకడంతో ఆ వాహనం నడుచుకుంటూ వెళ్తున్న రూప్‌సింగ్ తలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

PUBLIC NOTICE

on behalf of my Client Nilesh Agarwal the general public as well as financial institutions are hereby informed that my client intends to Purchase Plot nos :2, 3, 4, 8, 9 to 13, 14, 17, 19, 20, 21, 22, 27, 29 to 31, 34, 42 to 48 Located at Survey No.100B, Nijampet Village Bachupally Mandal from M/s. G.V. Builders and developers(Regd) who purchases the plots from DR. B.R.Ambedkar multipurpose MACC Society Ltd through open auction on 12/05/2024 In this Context the general public are hereby informed that if any body is have any objection they can present their bonafides to the undersigned with in 5 days after publication of this Notice. If no objection is received with in the stipulated time it will be deemed that there is no objection for purchase of Subject Plots and my client will proceed further on this issue

POCHIRAJU RAMESWARA PRASAD
LL.M., Advocate
Ruby 55, Praneeth Pranav County, 58, Praneeth County Rd, Krishna Reddy Pet, Hyderabad, Telangana 502319. Ph:9848242714

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029